
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.8, కనిష్ఠం 13.2



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శనివారం 29 నవంబరు 2025



ఉట్నూర్‌లోని కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పరిశీలకుడు వెంకన్న

నామినేషన్ కేంద్రాల పరిశీలన

ఉట్నూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గత రెండు రోజులుగా ప్రారంభమైన గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల నామినేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకుడు టి.వెంకన్న శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి శివరాజ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏజెన్సీలోని గాదిగూడ, నార్నూర్‌లలోని నామినేషన్ కేంద్రాలను సైతం పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అదనపుకలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, కార్యదర్శి శంకర్, తదితరులు ఉన్నారు.

3 నుంచి నామినేషన్ల స్వీకరణ

బోథ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 3నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ వర్గాల ఆయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3 నుంచి 5వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. 6న క్లస్టర్లలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని వివరించారు. అయితే ఎన్నికల నిర్వహణ సజావుగా సాగే విధంగా ప్రతీఒక్కరు సహకరించాలని ఎంపీడీవో కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించండి

తలమడుగు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడతలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు పాటించాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఓటర్లకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా ఇంటింటికి ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. ఇందులో ఎంపీడీవో శంకర్, ఆయా పార్టీల నాయకులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న జీసీడీవో ఛాయా

నేరడిగొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలను జీసిడిఓ మెస్రం ఛాయ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలోని విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 10వ తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోయే పరీక్షల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదవాలని సూచించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ లక్ష్యం కార్యక్రమంలో భాగంగా, విద్యార్థులకు ప్రతిరోజూ నిర్వహిస్తున్న స్లిప్ టెస్టులను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హెల్త్ రికార్డులను పరిశీలించి, ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఏఎన్ఎంకు సూచించారు. పాఠశాలలోని సిక్ రూమ్, మందుల నిల్వలను, అలాగే విద్యార్థుల తాగునీటి కోసం ఉపయోగిస్తున్న ఆర్.ఓ ప్లాంట్‌ను ఆమె పరిశీలించారు.



- ఆన్‌లైన్‌లో టీ-పోల్ యాప్ వివరాలు ఇలా..

ఓటర్ల కోసం.. టీ-పోల్ యాప్!

ఇచ్చోడ నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సులభంగా ఎన్నికల సమాచారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీ-పోల్ మొబైల్ యాప్‌ను రూపొందించింది. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల వివరాలు, ఓటరు స్లిప్పుల కోసం, ఎన్నికల నిర్వహణలో ఫిర్యాదు చేయడానికి ఈ యాప్ సహాయపడుతుంది. గూగుల్ ప్లేస్టోర్‌లో ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు ఓటర్లకు సూచించారు. స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని, యాప్‌పై ఓటర్లకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ప్రభుత్వం పేర్కొంది.

మళ్లీ పెరుగుతున్న చలి తీవ్రత

- సాత్నాలలో అత్యల్పంగా 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

ఆదిలాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నిన్న, మొన్నటి వరకు కనిపించని చలి తీవ్రత మళ్లీ పెరుగుతూ వస్తోంది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.8, కనిష్ఠంగా 13.2 డిగ్రీలుగా నమోదైంది. అత్యల్పంగా సాత్నాల మండలంలో 12.3, సోనాలలో 12.4, బేలలో 12.5, గాదిగూడలో 12.7, బోథ్‌లో 12.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో చలిప్రభావం అధికంగా కనిపిస్తుంది. తీవ్రమైన చలితో జనం చలిమంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందుతున్నారు. ఉదయం పూట పరిసర ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ముఖ్యంగా వాహనాల రాకపోకలకు పొగమంచు ఇబ్బందికరంగా మారుతుందని వాహనదారులు పేర్కొంటున్నారు.

కోవర్టులు ఉన్నారు.. జాగ్రత్త!



పల్లెల్లో ఊపందుకుంటున్న పంచాయతీ 'పాలి్ట్రిక్స్'



- జిల్లాలో అనుచరులను రంగంలోకి దింపి సమాచార సేకరణ
- సెల్‌ఫోన్‌లో మాట్లాడేందుకు జంకుతున్న అభ్యర్థులు
- డమ్మి నామినేషన్లతో జోరుగా బ్లాక్ మెయిల్ రాజకీయం
- గెలిచేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న నేతలు

ఆదిలాబాద్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నామినేషన్ల స్వీకరణ మొదలు కావడంతో పల్లె రాజకీయాలు మరింతగా ఊపందుకుంటున్నాయి. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అందరికీ జై కొడుతున్న ఓటర్లు ఎవరికీ మద్దతుగా నిలుస్తారో? అర్థం కాని పరిస్థితి ఉందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. గెలిచేంత వరకు అంతా అయోమయంగానే కనిపిస్తుందని చెబుతున్నారు.

జిల్లాలో నిత్యం అభ్యర్థుల వెంటే ఉంటున్న కోవర్టులు.. సమాచారాన్ని ఇతరులకు చేరవేసే అవకాశం ఉందంటున్నారు. దీంతో గెలుపు అవకాశాలు దెబ్బతింటాయని అభ్యర్థులు భయపడుతున్నారు. నలుగురి ముందు ఆలోచించి మరీ మాట్లాడే పరిస్థితి ఉందంటున్నారు. గెలుపుకోసం ఎత్తుకు పైఎత్తులు వేస్తున్న అభ్యర్థులు .. ప్రత్యర్థుల వ్యూహాలను పసిగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా కోవర్టుల పాత్ర కీలకం గా కనిపిస్తుంది. అప్రమత్తమైన అభ్యర్థులు ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ పరిస్థితులను అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. ఏదైనా అనుమానం వస్తే జాగ్రత్త పడుతున్నారు. అందరి ముందు కాకుండా ప్రత్యేకంగా మాట్లాడేందుకే ఆసక్తి చూపుతున్నారు. రహస్య ప్రదేశాలలో సమావేశమవుతూ గెలిచేందుకు మంతనాలు జరుపుతున్నారు.

పక్కా సమాచారంతోనే ముందుకు..

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థు లు ప్రత్యేకంగా అనుచర ఘనాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్దతు ధరలతో ప్రజల్లోకి వెళ్తూ.. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే అన్ని గ్రామాల లో సర్పంచ్ పదవి కోసం పోటాపోటీ అన్నట్లుగా కనిపిస్తుంది. ప్రచారంతో ఖర్చులు, హామీలను ఇవ్వడంలోను నువ్వా?నేనా? అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తమ అనుచరులను రంగంలోకి దింపుతున్న అభ్యర్థులు ఓటర్లు ప్రత్యర్థుల కదలికలను పసిగడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ముఖ్యకూడళ్లు, హోటళ్ల వద్ద నలుగురు కలిసి మాట్లాడుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. ఎవరు ఎలా మాట్లాడుతున్నారు? ఎవరికి మద్దతుగా నిలుస్తున్నారు? అనేది ముందే తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా పక్కా సమాచారంతోనే అడుగు ముందుకు వేస్తున్నారు. అలాగే తమ అనుచరుల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తమవుతున్నారు.

కాల్ రికార్డింగ్ భయం

ఎన్నికల బరిలో దిగుతున్న అభ్యర్థులు సమాచారాన్ని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడేందుకు జంకుతున్నారు. ఎందుకంటే కాల్ రికార్డింగ్ చేస్తూ వైరల్ చేసే అవకాశం ఉండడంతో జాగ్రత్త పడుతున్నారు. ముఖ్య విషయాలపై అనుచరులను నేరుగా (6వ పేజీలో...)

నామినేషన్ల రాజకీయం

మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో రెండవ రోజు జోరుగా నామినేషన్లు దాఖలైనట్లు తెలుస్తుంది. ఒక్కో గ్రామంలో పది నుంచి 15 వరకు నామినేషన్లు దాఖలవుతున్నా.. ముఖ్యంగా ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల మధ్యనే తీవ్రమైన పోటీ కనిపిస్తుంది. మిగితా వారంతా డమ్మీ నామినేషన్లతో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది.నామినేషన్ వేయవద్దంటూ బుజ్జగింపులకు దిగుతున్నారు. అయినా వెనక్కి తగ్గకపోవడంతో సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు. ఎంతో కొంత ఇచ్చి తమదారికి తెచ్చుకుంటున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు అన్నిరకాల ప్రయత్నా లు చేస్తున్నారు. ఓటర్ల మద్దతు లేక పోయినా.. నామినేషన్ వేయడం.. ఆపైగా అభ్యర్థుల నుంచి ఎంతో కొంత గుంజుతూ జేబులో వేసుకుంటున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేంత వరకు ఎవరు బరిలో ఉంటారో? ఎవరు తప్పుకుంటారో? తెలియని పరిస్థితి ఉందని చెబుతున్నారు.

సాఫీగా నామినేషన్ల ప్రక్రియ

- కలెక్టర్ రాజర్షి షా ఆదేశం
- ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో నామినేషన్ కేంద్రాల తనిఖీ



పులిమడుగులోని నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవోలు

ఉట్నూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా, సాఫీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇచ్చోడ మండలం కోకస్మన్నూర్, సిరికొండ గ్రామ పంచాయతీ, ఇంద్రవెల్లి మండలం ముత్నూర్, ఉట్నూర్ మండలం పులిమడుగు గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ నామినేషన్లు దాఖలుచేసేందుకు వచ్చే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, అవసరమైన పత్రాలు, విధి విధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులతో మాట్లాడిన కలెక్టర్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ఈనెల 29వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రతీరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అధికారులు కచ్చితంగా సమయపాలన పాటించాలని, ఇందుకు సంబధించిన రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. తర్వాత ఎన్నికల నేపథ్యంలో ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు వద్ద విధులు నిర్వహిస్తున్న స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ అధికారులను ఐటీడీఏ ఉట్నూర్ పీఓ యువరాజ్ మర్మాట్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్లు రమేష్, తుకారాం, ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవోలు నరేష్, రాయిస్‌ఉల్లా, కుమార్, జీవన్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిరికొండ మండలంలో ఎన్నికల సందడి మొదలైంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని సిరికొండ క్లస్టర్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు తీసుకున్న భద్రతా చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మరోవైపు మండలంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్ రాజార్షిషా, జనరల్ అబ్జర్వర్ టి.వెంకన్న, సబ్ కలెక్టర్ ఎస్.రాజేశ్వర్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఇంద్రవెల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల జనరల్ అబ్జార్వర్ వెంకన్న, సబ్ కలెక్టర్ ఎస్.రాజేశ్వర్‌లు పరిశీలించారు.



సిరికొండలో నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా



సిరికొండలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలను పరిశీలిస్తూ..

పలు మండలాల్లో జోరుగా నామినేషన్లు

ఉట్నూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల ఎన్నికల కోసం రెండవ రోజు జరిగిన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం కూడా జోరుగా సాగింది. ఉట్నూర్ సర్పంచ్ స్థానానికి రాథోడ్‌సుమలత నామినేషన్ సమర్పించగా.. పులిమడుగు సర్పంచ్ స్థానానికి సుజాత శ్యామ్, సరిత శ్రీనివాస్‌లు నామినేషన్లు సమర్పించారు. మండలంలో 38 గ్రామ పంచాయతీలు ఉండగా బాబాపూర్, గంగాపూర్, కామాయిపేట్ గ్రామ పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నికలు నిర్వహిస్తామని ఆయా గ్రామాల ప్రజలు తీర్మాణాలు చేశారు. రెండవ రోజు 39 మంది సర్పంచ్ అభ్యర్థులు ఆయా గ్రామ పంచాయతీలలో నామినేషన్లు సమర్పించారని అధికార వర్గాలు తెలిపాయి.

- ఇంద్రవెల్లిలో ఊపందుకున్న నామినేషన్ల పర్వం

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థ సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా రెండో రోజు నామినేషన్ దాఖాలు ఊపందుకుంది. మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయితీలు, 244 వార్డులు ఉండగా మొదటి రోజు మండలంలో నలుగురు సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రెండో రోజు ఏర్పాటు చేసిన ఏడు క్లస్టర్ల వారీగా నామినేషన్ కేంద్రాల్లో 49 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలాలు చేశారు. మొత్తం 53 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. 29 గ్రామ పంచాయితీల పరిధిలోని రెండో రోజు నామినేషన్ స్వీకరణలో 42 మంది వార్డు అభ్యర్థులు నామినేషన్లు దాఖాలు చేసినట్లు మండల ఎన్నికల అధికారి జీవన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్సై ఇ.సాయన్న ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

జోరుగా రబీ పంటల సాగు

మిర్చి పంటతో రైతుకు లాభాలు

7లో

లక్ష్మంపూర్ వద్ద వాహనాల తనిఖీ

ఉద్యోగం పేరిట మోసం ..కేసు నమోదు

ఎస్‌పీఎం ట్రాన్స్‌ఫార్మర్ వర్క్ షాప్‌లో చోరీ

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలోని ఎస్‌పీఎం ట్రాన్స్‌ఫార్మర్ రూరల్ వర్క్ షాప్‌లో చోరీ ఘటన చోటు చేసుకుంది. గురువారం అర్ధరాత్రి ఆరుగురు దుండగులు వర్క్ షాప్‌లో చొరబడి ఏడు ట్రాన్స్‌ఫార్మర్ జాబ్‌లలోని కాపర్ తీగలు దొంగతనం చేశారు. చోరీకి గురైన కాపర్ వైరు విలువ దాదాపు మూడున్నర లక్షల వరకు ఉంటుందని సిబ్బంది తెలిపారు. ఘటన స్థలానికి వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్, ఎస్సై అశోక్ చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజ్, క్లూస్ టీమ్ ద్వారా పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఎస్ఈ రాథోడ్ శేషరావు, విద్యుత్ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆదివాసీలకు ఆదర్శం మడావి

- ఆదివాసీ, గిరిజనులలో తొలి ఐఏఎస్‌గా గుర్తింపు
- నిరుపేదల సంక్షేమానికి విశేష కృషి
- నేడు మడావి తుకారాం వర్ధంతి
- లక్షేటిపేటలో ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వహణ కమిటీ సభ్యులు

ఉట్నూర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆదివాసీ, గిరిజనులకు ఆదర్శంగా నిలిచిన మడావి తుకారాం 27వ వర్ధంతి శనివారం ఉట్నూర్ మండలంలోని లక్షేటిపేట గ్రామంలో నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి చురుకుగా చదువులు రాణించిన మడావి తుకారాం బీఎస్సీ డిగ్రీ పూర్తి కాగానే గ్రూప్ వన్ ఉద్యోగం సాధించి మొదటి సారిగా నిజామాబాద్ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరిం చారు. అక్కడి నుంచి అంచలంచెలుగా ఎదిగిన ఆయన ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సహాయ ప్రాజెక్టు అధికార జనరల్‌గా పని చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారు. ఏజెన్సీ గ్రామాలలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధితో పాటు సాగునీటి రంగాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను ఐఏఎస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. రాష్ట్రంలోని నల్గొండ, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి ఆయన పేదల సంక్షేమానికి కృషి చేశారు. తెలంగాణ రాష్ట్ర బేవరైజ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో అనారోగ్యానికి గురై మృతి చెందారు. అంతేకాకుండా ప్రస్తుతం ఆయన భార్య పిల్లలు కూతురు ఉట్నూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. ఆదివాసీ గిరిజనులలో తొలి ఐఏఎస్ అధికారిగా సమాజం అభివృద్ధి కోసం సేవలు అందించిన తుకారాంను గిరిజన యువత ఆదర్శంగా తీసుకుంటున్నారు.



లింగోజీతండా ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న తుకారాం విగ్రహం(ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

ఉట్నూర్ మండలంలోని లింగోజీ తండా ఎక్స్‌రోడ్డు వద్ద దివంగత అధికారి తుకారాం విగ్రహంను ఏర్పాటు చేశారు. యేటా నవంబరు 29న ఆయన సొంత గ్రామం అయిన లక్షేటిపేటలో గిరిజన సంప్రదాయ ప్రకారం కుటుంబ సభ్యులు తుకారాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఎక్స్‌రోడ్డులో తుకారాం విగ్రహం వద్ద కూడా గిరిజనులు పూజ కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో పాటు ఐటీడీఏ అధికారులు జిల్లా అధికారులు తుకారాం ఎక్స్ రోడ్డుకు చేరుకొని శనివారం ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తారని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. గత రెండు రోజులుగా తుకారాం యూత్ కమిటీ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.

స్వచ్ఛ గ్రామాలను నిర్మిద్దాం

- వాష్ ప్రాజెక్టు మేనేజర్ బ్రహ్మచారి

బజార్‌హత్నూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబం కచ్చితంగా ఆరోగ్య అలవాట్లను పాటించేలా ప్రోత్సహిస్తూ స్వచ్ఛ గ్రామాలను నిర్మించే దిశగా అడుగేయాలని వాష్ ప్రాజెక్టు మేనేజర్ బ్రహ్మచారి, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ప్రవీణ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథకం కార్యాలయంలో సహజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతలపై గ్రామైక్య సంఘ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘ సమావేశాలలో ఆరోగ్య అలవాట్లపై అజెండా తప్పనిసరిగా ఉండాలని, ఆరోగ్య అలవాట్లను ప్రోత్సహించాలన్నారు. శుభ్రమైన నీరు, మరుగుదొడ్ల శుభ్రత పాటించేలా ప్రోత్సాహించాలని పేర్కొన్నారు. స్వచ్ఛ గ్రామాల దిశగా అందరూ మహిళలు ముందుకు వెళ్లేలా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకట్ రెడ్డి, సీసీలు శంకర్, పురుషోత్తం, గంగయ్య, ఈశ్వర్, స్వయం సహాయక సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో సంఘం సభ్యులు, సిబ్బంది



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గణేష్ యాదవ్

వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సారించండి : డీఐఈవో

తలమడుగు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేకదృష్టి సాధించాలని ఆదిలాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గణేశ్‌కుమార్ జాదవ్ కోరారు. శుక్రవారం తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థుల సమయాన్ని వృధా చేయకుండా అధ్యాపకులు అందించే స్థలాల సూచనలు పాటించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అదేవిధంగా ప్రతీ విద్యార్థి ప్రతీరోజు కళాశాలకు తప్పకుండా రావాలని కోరారు. హాజరు శాతం తక్కువ ఉన్న విద్యార్థులకు హాల్ టికెట్ ఇవ్వడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. అదేవిధంగా అధ్యాపకులు, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్య బోధనలు అందించాలని సూచించారు. అనంతరం కళాశాలలో జరుగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, విద్యార్థుల హాజరు పెంచే దిశగా కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని సూచించారు. డిసెంబరు చివరిలోగా ప్రాక్టికల్స్ పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఇందులో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుదర్శన్, సీనియర్ అధ్యాపకులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

30న ఆరట్టు వేడుకలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఆరట్టు మహోత్సవాన్ని ఆదిలాబాద్‌లోని గోపాలకృష్ణ మఠం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి సంతోష్ శర్మ తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆరట్టు మహోత్సవ కరపత్రాలను మఠాధిపతి యోగానంద సరస్వతితో కలిసి ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు శంకరన్ నంబూద్రి హాజరవుతారని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చందా గణేష్, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి సత్యం, కోశాధికారి గౌరు లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు గొర్ల కిష్టన్న, ఆరట్టు కార్యక్రమ నిర్వాహకులు సాయిని రవి కుమార్ పాల్గొన్నారు.

హనుమాన్ స్వాముల నగర సంకీర్తన

బోథ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట(బి) గ్రామంలో శుక్రవారం హనుమాన్ స్వాములు నగర సంకీర్తన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి నగర సంకీర్తన కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామంలోని ప్రధీన వీధుల గుండా హనుమాన్ నామస్మరణ చేస్తూ ప్రసాదాన్ని పంచుతూ ర్యాలీని నిర్వహించారు. అనంతరం హనుమాన్ సత్రం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కౌట(బి)లో నగర సంకీర్తన చేస్తున్న హనుమాన్ స్వాములు

పూలే సేవలు చిరస్మరణీయం

● మహాత్మా జ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా నాయకుల ఘన నివాళి



ఆదిలాబాద్‌లో పూలే దంపతుల విగ్రహాలకు నివాళ్లర్పిస్తున్న నేతలు



ఇంద్రవెల్లిలో నివాళ్లర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమ పితామహుడు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే దంపతుల స్ఫూర్తితో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే పిలుపునిచ్చారు. జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ... స్త్రీ విద్య, సమసమాజ నిర్మాణం కోసం పూలే దంపతులు ఎనలేని కృషి చేశారని, వారి కృషి ఫలితంగానే ఈరోజు బహుజనలకు సామాజిక న్యాయం లభిస్తోందని అన్నారు. మాలితో పాటు బహుజన కులాలలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉందని, బహుజన కులాల్లో విద్య వ్యాప్తికి విద్యావంతులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు పూలే సిద్ధాంతాలను అనుసరిస్తూ అందరికీ విద్య అందాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతమైన విద్య అందించేందుకు కృషి చేశారని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా వెళ్లి బీసీ స్టడీ సర్కిల్లోని పూలే విగ్రహానికి పూలమాలలు అందజేసి శ్రద్ధాంజలి ఘటించారు. పూలే ఆశయాలు, సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని రామన్న సూచించారు. మాలీ మహా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శేండే, మాలి ఎం ప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ అంబేకర్, భాస్కర్ ప్రధాన్, తదితరులు పాల్గొన్నారు.

● ఆశయాలను కొనసాగించాలి

ఇంద్రవెల్లి: మహాత్మా జ్యోతిబా పూలే అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి ఎంతో గొప్పదని ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ మాదిగ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జ్యోతిబా పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే సమాజ సేవ నా ధ్యేయం, సమసమాజ స్థాపన తన ఆశయమని ప్రకటించి పూలే అయన సతీమణి సావిత్రీ బాయిపూలే బలహీనవర్గాల అభ్యున్నతి కోసం సొంతంగా పాఠశాలలను నిర్వహించి, ఉచితంగా విద్యను అందించారని తెలిపారు. ఇందులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే జితేంధర్, మాజీ సర్పంచ్ కోరెంగ సుంకట్ రావు, మీర్జా జీలానీ బేగ్, పరత్ వాగ్ దత్త, సామాజిక కార్యకర్త రాథోడ్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సాయిలింగి గ్రామస్థులు

రైతు సంక్షేమం కోసం ప్రత్యేక కృషి : బోథ్ ఎమ్మెల్యే

తాంసి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జామిడీ, కపర్ల, పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన రైతు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తామని, తనవంతు సహాయాన్ని కూడా అందిస్తానని అన్నారు. రైతులు మనోధైర్యంతో వ్యవసాయంలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.

● బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

నేరడిగొండ: తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో డిసెంబరు 4వ తేదీన నిర్వహించనున్న సాయిబాబా బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను గ్రామస్థులు ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు.

● బాధిత కుటుంబాలను పరామర్శ

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చెవుల రత్నమాల, బొస్రా గ్రామానికి చెందిన సొంటకే లక్ష్మణ్‌ల కుటుంబాలను శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాధవ్ పరామర్శించారు. బజార్ హత్నూర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన చెవుల రత్నమాల, ప్రమాదంలో గాయపడిన కొడుకు లక్ష్మణ్ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు.

కోవర్టులున్నారు.. జాగ్రత్త!

(5వ పేజీ తరువాయి...)

కలుస్తూ చర్చిస్తున్నారు. కొంత మంది అభ్యర్థులు తమ ప్రత్యర్థుల ఫోన్‌కాల్స్‌ను రహస్యంగా రికార్డ్ చేయడం, ఆ తర్వాత గ్రామ గ్రూపుల్లో వైరల్ చేస్తూ.. ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఎక్కువ మంది అభ్యర్థులు వాట్సాప్ కాల్‌తోనే మాట్లాడేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏది పడితే అది ఫోన్‌లో మాట్లాడకూడదని తమ అనుచరులను ముందే హెచ్చరిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలంటూ అభ్యర్థులు సూచిస్తున్నారు.



నిరాలలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్

గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

జైనథ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పీఎం నరేంద్ర మోదీ కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మండలంలోని నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన జైనథ్, బోరజ్, మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ బలపర్చిన సర్పంచ్‌లను గెలిపించాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు లోక కరుణాకర్ రెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ కన్వీనర్ బోయర్‌విజయ్, బోరజ్ మండల అధ్యక్షుడు గాజుల సన్ని, నాయకులు రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి డిక్లరేషన్.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

ఉట్నూర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంటుందని, కామారెడ్డి డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు ఘర్షకుర్తి వెంకటేశ్ డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికలు 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని నాలుగు నెలలుగా కాలయాపన చేసి.. దొడ్డిదారిన 46 జీవో తెచ్చి ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసింది అన్నారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల తరహాలోనే బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాల్సి ఉందన్నారు. కులవృత్తుల వారికి గదులు నిర్మించి ప్రతీ మండలంలో నాయీబ్రాహ్మణులకు, రజకులకు కేటాయించాలన్నారు. కులవృత్తులకు ఇస్తామన్న విద్యుత్ సబ్సిడీ ఇవ్వక పోవడంతో ఒక్కొక్కరికి రూ.20 వేల అదనపు భారం పడుతుందన్నారు. సంక్షేమ హాస్టల్‌ల విద్యార్థులకు కటింగ్ చేసే టెండర్లు నాయీబ్రాహ్మణులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచిన్, ప్రవీణ్, దేవయ్య, గంగాదర్ పాల్గొన్నారు.

తపస్ మండల నూతన కమిటీల ఎన్నిక

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండలాల కమిటీలను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్, రూరల్, తాంసి, భీంపూర్, తలమడుగు, జైనథ్ మండలాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. వారిని నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహాన్, వలబోజు గోపికృష్ణ, నారాయణ, మనోజ్ రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

» నామినేషన్లు వేయక ముందే పోటీ అభ్యర్థుల ప్రచారం

బోథ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఏర్పాట్లపై అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉండగా.. ఈసారి ఎన్నికల బరిలో దిగేవారు ప్రచార పర్వాన్ని ప్రారంభించారు. నామినేషన్ల స్వీకరణ సమయానికి 10 రోజుల ముందుగానే ఎన్నికల బరిలో ఉండేవారు ప్రచారాన్ని ప్రారంభించారు. దీంతో గ్రామాలలో ఎన్నికల కులహారం ప్రారంభమైంది.

పార్టీకి దరఖాస్తులు.. కండువాలు వేసుకుని ప్రచారం

ఈసారి తామే ఎన్నికల బరిలో ఉంటున్నామని, అయితే పార్టీల తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ నియోజవర్గ ఇన్‌చార్జీలకు మండల పార్టీ కన్వీనర్లకు ఆశావహులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే ఎన్నికల నియమావళి ప్రకారం సర్పంచ్ అభ్యర్థులకు పార్టీ గుర్తులు ఉండకుండా బరిలో ఉండే అభ్యర్థులు మాత్రం తాము ఫలానా పార్టీ నుంచి బరిలోకి దిగుతున్నామని తెలిసేలా పార్టీ కండువలను కప్పుకొని బోథ్ మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్నారు. మరోవైపు రాజకీయ పార్టీల తరపున ఎన్నికల బరిలో ఉంటున్నందున పైస్థాయి నాయకులు కిందిస్థాయి నాయకుల సహకారం ఉండే విధంగా చూడాలని కోరుకుంటూ ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారు. బోథ్ మండల కేంద్రంలో సర్పంచ్ బరిలో దిగేవారు బీఆర్‌ఎస్ తరపున నలుగురు మంది దరఖాస్తు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే బీజేపీ తరపున సైతం ఇరువురు నామినేషన్ వేసేందుకు ఆసక్తి చూస్తున్నట్లు సమాచారం.

ఇప్పటి నుంచే విందులు.. వినోదాలు

ఎన్నికలకు మరో 20 రోజులు గడువు ఉండగా బరిలో నిలిచే అభ్యర్థులు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో రాజకీయ విందు ప్రారంభించినట్లు ప్రచారం సాగుతోంది. ఇక ఇదే అదునుగా భావించిన కొందరు ఇప్పటి నుంచి తమ మద్దతు మీకే ఉంటుందంటూ బరిలో దిగే వారి వెంట తిరుగుతున్నారు. కొంతమంది బరిలో దిగే అభ్యర్థులు మాత్రం ఒంటరిగా ప్రచారం చేసుకుంటూ యువజన సంఘాల వారికి విందులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. పోటీ తీవ్రంగా ఉండడంతో పల్లె పోరు రసవత్తరంగా సాగనుంది.



మాట్లాడుతున్న ఎస్ఐ గణేష్

కబడ్డీ పోటీలకు జట్ల ఎంపిక

నర్సాపూర్(జి), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సీనియర్, జూనియర్ జట్లను ఎంపిక చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ గణేష్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. క్రీడల ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, విద్యార్థులు కబడ్డీలో తమ నైపుణ్యం పెంచుకోవాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 200 మంది కబడ్డీ క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన వారిని సీనియర్, జూనియర్ బాలబాలికల జట్లుగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అసోసియేషన్ సెక్రటరీ బర్కుంట సునీల్, టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు దర్శనం దేవేందర్, అంబాజీ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హిల్ట్ పాలసీపై బహిరంగ చర్చకు మంత్రి ఉత్తమ్ సిద్ధమా?

» బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (హెచ్‌ఐఎల్‌టీ) పాలసీ ప్రతిపక్షాలకు అర్థం కాలేదనడం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దివాళా కోరుతనానికి నిదర్శనమని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ విధానంలో పారదర్శకత ఉంటే, దానిపై చర్చించేందుకు అసెంబ్లీని ఎందుకు సమావేశపరచడం లేదన్నారు. హిల్ట్ పాలసీ అత్యంత పారదర్శకంగా ఉందని, ఎలాంటి కుంభకోణానికి ఆస్కారం లేదంటున్న మంత్రి ఉత్తమ్ ఈ విధానంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఓపెన్ డిబేట్‌కు మంత్రి సిద్ధపడితే శనివారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో జర్నలిస్టుల సమక్షంలో చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. లేదంటే డేట్, టైమ్, వేదికను మంత్రి ఖరారు చేసినా తనకు అభ్యంతరం లేదని చెప్పారు. హిల్ట్ పాలసీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని, దీనిపై గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే చర్చ జరిగిందంటున్న మంత్రి ఉత్తమ్ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను ఆదర్శంగా తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పెద్దలతో వారికి ఉన్న మ్యాచ్ ఫిక్సింగ్ ఏంటి అని ప్రశ్నించారు. పరిశ్రమలకు చెందిన 9,292 ఎకరాల భూముల్లో నిర్మాణాలు చేసుకోవచ్చంటూ, వాటిని ఆ ల్యాండ్ ఓనర్లకే అడ్డికి పావుశేరు ధరలకే ఎందుకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. హిల్ట్ పాలసీలో ఎలాంటి అవినీతి లేదంటున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి తక్షణమే అసెంబ్లీని సమావేశపర్చి చర్చించిన తర్వాతే పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పాలసీ రద్దుకు భారీ ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలి

» కమ్యూనిటీ కాంటాక్ట్‌లో సీఐ గోపినాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ గోపినాథ్

భైంసా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణ ప్రక్రియలో ప్రతీఒక్కరు పోలీసుశాఖకు సహకరించాలని భైంసాటౌన్ సీఐ గోపినాథ్ కోరారు. శుక్రవారం భైంసా పట్టణ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. రోజుకోరీతిలో పెరుగుతున్న సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త సాంకేతిక విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. వీటి బారిన పడకుండా ఉండేందుకు బ్యాంక్ అకౌంట్ల పాస్‌వర్డులు, ఓటీపీ నెంబర్లు తెలిపే విషయంలో జాగరుకతతో నడుచుకోవాలన్నారు. కొత్త నెంబర్ల ద్వారా సెల్ ఫోన్లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. మోసాల బారిన పడినట్లుగా భావించిన, గుర్తించిన వెంటనే పోలీసుశాఖకు సంప్రదించాలని కోరారు. బెట్టింగ్ నిర్వాహకుల మాయమాటలకు, ప్రలోభాలకు తలొగ్గితే అన్నివిధాలుగా నష్టపోవాల్సి వస్తుందని, వారికి దూరంగా ఉండాలని అన్నారు. బెట్టింగ్ మాయజాలంలో పడితే జీవితాలు బుగ్గిపాలవుతాయని వెల్లడించారు. నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు ఎంతో ముఖ్యమని, ఆ దిశగా ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైన గంజాయి సేవించడం, విక్రయాలు, రవాణా చేస్తే వెంటనే 100 కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సరైన ధృవీకరణ పత్రాలు లేని పలు వాహనాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఇందులో టౌన్ ఎస్ఐ సుప్రియ, పోలీసు సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



గోవింద్‌ను సన్మానిస్తున్న అధికారులు

జడ్పీ సీఈవోకు సన్మానం

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందనున్న జిల్లా పరిషత్ సీఈవో గోవింద్‌ను పలువురు జిల్లా అధికారులు సన్మానించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లాధికారులు జడ్పీ సీఈవోకు శాలువాలతో సన్మానించి పూలమొక్క అందజేశారు. కార్యక్రమంలో సీపీవో జీవరత్నం, జిల్లాఖజానా అధికారి సరోజ, సహాపలువురు అధికారులు ఉన్నారు.



పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

బీజేపీలో పలువురి చేరిక

సోన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సోన్ మండలం సాకెర గ్రామ మాజీ వార్డు మెంబర్ లక్ష్మీ ఉదయ్‌తో పాటు నాయకులు శ్రావణ్, కిరణ్‌లు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా వేసి పార్టీలోకి హ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ హరీష్‌రెడ్డి, నాయకులు నుంచు నవీన్, పోశెట్టితో పాటు తదితరులు పాల్గొన్నారు.

దిమ్మదుర్తి గ్రామంలో..

మామడ: మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన సుమారు 20మంది శుక్రవారం ఎమ్మెల్యే, శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాసంలో బీజేపీలో చేరారు. మహేశ్వర్‌రెడ్డి వారికి బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చినా వాటిని నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ను నమ్మే పరిస్థితులు లేవని, అందుకే ప్రజలు బీజేపీలో చేరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మామడ బీజేపీ అధ్యక్షుడు రంజిత్ కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు బాపు రెడ్డి, మామడ ఇన్‌చార్జి సాహెబ్‌రావు ఉన్నారు.



దిమ్మదుర్తి కార్యకర్తలకు శాలువా కప్పుతున్న మహేశ్వర్‌రెడ్డి

రైతు దీక్ష విరమణ

» రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

» మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కుంటాల, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కుంటాలలో బుధవారం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన సోయాలను వెంటనే గోదాంకు తరలించి రైతలను ఆదుకోవాలని కోరుతూ మండల కేంద్రం కుంటాల చెందిన పడకంటి దత్తు అనే రైతు చేపట్టిన దీక్ష శుక్రవారం సాయంత్రం విరమించాడు. ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రైతుల కోరిక మేరకు దీక్ష శిబిరానికి వచ్చి రైతు దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటాల మండల రైతుల సమస్యలను ఇదివరకే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని, మరోసారి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకు ముందు రైతు దీక్షకు పలు పార్టీల నాయకులు పడకంటి రమాదేవి, లోలం శ్యాంసుందర్, రాంకిషన్ రెడ్డిలు దీక్షకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



దీక్షను విరమింపజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

రేపటి నుంచి సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు



ఆలయంలోని సాయిబాబా మూలవిరాట్



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

సిల్వర్ జూబ్లీకి ముస్తాబైన సాయిలింగి సాయిబాబా ఆలయం

తలమడుగు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేపట్టామని ఆలయ అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు దెబ్బడి అశోక్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో నిర్మించిన ఈ ఆలయంలో ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితం గ్రామస్తుల భక్తుల సహకారంతో గుడి బడి తడి ఒడి అనే నినాదంతో గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ఇందులో భాగంగా సాయిబాబా భక్తుల సహకారం గ్రామస్తుల ప్రోత్సహంతో సాయిబాబా ఆలయాన్ని ప్రారంభించామన్నారు. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు దాదాపు 25 సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించామన్నారు. ఈ సంవత్సరం 25 సంవత్సరాలు పూర్తి చేసిన సందర్భంగా సాయిబాబా ఆలయాన్ని రూ.40 లక్షల వ్యయంతో ఆలయాన్ని అధునికరించామన్నారు. అదే విధంగా ఈ సంవత్సరం బ్రహ్మోత్సవాలను ఈనెల 30 నుంచి డిసెంబర్ 4 వరకు నిర్వహిస్తామన్నారు. ఐదు రోజులపాటు ఆలయంలో బీద పండితుల మంత్ర ఉచ్ఛరణ మధ్య యజ్ఞ కార్యక్రమాలు సద్గురువుల ప్రవచనాలు ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా డిసెంబర్ 4న యజ్ఞ పూర్ణహంతి సాయిబాబా పల్లకి ఊరేగింపు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి సాయిబాబా భక్తులు మండల వాసులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనే విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పథంలో సాయిలింగి గ్రామం

పుట్టిన ఊరుకు కన్న తల్లిదండ్రులకు ఎంత సేవ చేయాలనే సంకల్పంతో సాయిలింగి గ్రామానికి చెందిన దెబ్బడి అశోక్ సంకల్పించాడు. వృత్తి రీత్యా బీఎస్ఎన్ఎల్‌లో ఉన్నత ఉద్యోగం చేశాడు. విధులు నిర్వహిస్తూ సొంత గ్రామానికి అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గ్రామస్తుల సహకారంతో గుడి బడి తడి ఒడి నినాదంతో సాయిబాబా ఆలయం నిర్మించారు. ఉన్నతాధికారుల సహకారంతో ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ హైస్కూల్‌గా మార్చి తర్వాత కేజీబీ పాఠశాలను ఏర్పాటు చేసుకొని ఇంటర్మీడియట్ వరకు విద్యను అభివృద్ధి పరిచారు. అంతేకాకుండా గ్రామస్తులకు సాగునీటి సౌకర్యం కల్పించేందుకు జిల్లా అధికార సహకారంతో చెరువుల మరమ్మతు చెక్ డ్యాముల నిర్మాణంతో సాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం రైతులు సాగునీటి సౌకర్యంతో కూరగాయలు సాగు చేసుకుంటూ జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో విక్రయిస్తున్నారు. అంతేకాకుండా అనాథ వృద్ధులకు ఆశ్రమం కల్పించాలని సంకల్పంతో ఒడి సాయి వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి దాదాపు 60 మంది అనాథ వృద్ధులకు ఆశ్రమాన్ని కల్పించారు. అంతటితో ఆగకుండా సామాజిక సేవా దృక్పథంతో చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధిపై శిక్షణ కల్పించారు. ప్రస్తుతం శిక్షణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. సాయిలింగి గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.





వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులు

పుట్టిన జన్మను సార్థకం చేసుకోవడానికే...

మానవ జన్మగా పుట్టిన ప్రతి ఒక్కరూ తమ జన్మ సార్థకం చేసుకోవడానికి సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలి. దృఢ సంకల్పంతో ఉన్న ఊరుకు ఏమైనా చేయాలనే సంకల్పంతో గుడి బడి తడి ఒడి నినాదంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. గ్రామస్తులకు అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

- దెబ్బడి అశోక్,
సాయిబాబా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

● ఏఈఓ రుషికేష్



పంట మార్పిడిలో భాగంగా రైతు వేసిన నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏఈఓ

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరికి బదులుగా ఆరుతడి పంటలతో రైతులకు అధికలాభాలు వస్తాయని విట్టోలి ఏఈఓ రుషికేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి పలు సలహా, సూచనలు ఇచ్చారు. ఆరుతడి పంటలకు తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో తగు మెళకువలు పాటించినట్లయితే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఎకరం వరి పంట సాగునీరుతో 5 ఎకరాల ఆరుతడి పంట సాగు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంట మార్పిడి వలన తెగుళ్ల, పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. వరి కన్నా ఆరుతడి పంటలకే మార్కెట్‌లో ధర ఎక్కువ కాబట్టి ఈ దిశలో రైతులు ముందుకెళ్లాలని సూచించారు.

జోరుగా రబీ సాగు



పిప్పరి గ్రామ సమీపంలో పెరుగుతున్న కొత్తిమీర

బజార్ హత్నూర్ , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా ఖరీఫ్ పంటలతో కర్షకులు తీవ్రనష్టాన్ని చవిచూశారు. వర్షాలతో ఈసారి రబీసాగు ఆలస్యం కాగా కర్షకులు రబీసాగులో జోరు పెంచారు. ఖరీఫ్‌లో వేసిన పత్తి, సోయాస్థానాల్లో రబీపంటలు జోరందుకోగా మండలంలో ఈ ఏడాది రబీసాగులో జొన్న, మొక్కజొన్న, కొత్తిమీర, అతితక్కువగా శనగతో పాటు కూరగాయలు పండిస్తున్నారు. కంది ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఖరీఫ్‌నష్టాన్ని రబీలో భర్తీ చేసే ప్రయత్నంలో ఉన్నారు. రబీసాగులో ఇప్పటికే మొలకెత్తిన వాటికి మోటార్లు, స్పింకర్ల సహాయంతో నీటితడులు అందిస్తున్నారు. అడవి జంతువులు, పశువుల నుంచి పంటకు రక్షణగా చుట్టూ చీరలు, సౌర యంత్రాల తీగలు చుడుతూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

క్రైం సమాచారం

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉట్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉట్నూర్ రామ్‌నగర్‌కు చెందిన నూర్‌సింగ్(56) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్న నూర్‌సింగ్ అతని భార్య పంచపూల మధ్య పక్షం రోజులుగా గొడవలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. గురువారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరుగుతున్నప్పుడు కూర్చీలో నుంచి కింద పడిపోవడంతో తలకు గాయమైందని, అనంతరం ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడని భార్య పంచపూల తెలిపిందన్నారు. మృతుడి సోదరుడు బాలాజి ఫిర్యాదు మేరకు శవాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించి శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

దేశీదారు పట్టివేత



పట్టుకున్న దేశీదారు

కుభీర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నంద పహాడ్ గ్రామంలో శుక్రవారం అక్రమంగా నిల్వ ఉంచిన దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. దేశీదారు ఉందన్న సమాచారంతో పోలీసులు వెళ్లి వెతకడంతో అక్కడ 171 బాటిల్స్ దేశీదారు లభ్యమయిందని, మొత్తం 19.21 లీటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



లక్ష్మంపూర్ చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ ఫణిందర్

తలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని లక్ష్మంపూర్ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలను పోలీసు అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ మాట్లాడుతూ ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల జరుగుతున్నాయని ఎన్నికల అధికారి ఆదేశాల కోసం వాహనాలు తనిఖీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు. అదేవిధంగా దూరప్రాంతాల వారు ప్రయాణం చేసేవారు 50 వేలకు పైగా నగదు ఉంచుకోరాదన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యంలో సరఫరా చేసే వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో తాంసి ఎస్ఐ జీవన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం పేరుతో మోసం చేసిన ఇరువురిపై కేసు నమోదైంది. ప్రశాంత జవాడే మహారాష్ట్ర సింగరేణిలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి కొందరి నుంచి విడతల వారీగా రూ.2 లక్షలు తీసుకొని మోసం చేశాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. ఇదే వ్యవహారంలో గుగ్గుస్‌కు చెందిన ఈర్ల రాజేష్ అనే మరో వ్యక్తిపై సైతం కేసు నమోదు అయిందన్నారు. స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో ప్రశాంత్ జవాడేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలకు బ్రోకర్లను, మధ్య వర్తులను నమ్మకోవద్దని సూచించారు. కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని తెలిపారు. ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసే మాటల నమ్మవద్దని, నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసే వారిపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

పోలీసు విధులకు ఆటంకపరిచిన వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పోలీసు విధులకు ఆటంకపర్చిన ఒకరిని అరెస్టు చేశారు. పట్టణంలోని డైట్ మైదానం సమీపంలో ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద షేక్‌హబీబ్ రాత్రి పూట విధులు నిర్వహిస్తున్న పోలీసు విధులకు ఆటంకం కలిగించగా.. ఆయనను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. విధులకు ఆటంకపరిచిన, పోలీసు గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి 11 గంటల తర్వాత అత్యవసర సేవలు తప్ప మిగిలిన వ్యాపార సముదాయాలు మూసివేయాలని స్పష్టం చేశారు.

రూ.20 లక్షల ఇన్సూరెన్స్ అందజేత



బాధిత కుటుంబానికి రూ.20 లక్షల చెక్కును అందిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

తాంసి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు కుటుంబానికి పాలసీ ఆసరాగా నిలిచింది. సంవత్సరానికి రూ.వెయ్యి చెల్లించి 20 లక్షలు ఇన్సూరెన్స్ పొందాడు. వివరాల్లోకి వెళితే.. తాంసి మండలంలోని సావర్గ గ్రామానికి చెందిన గజకంటి ప్రభాకర్ 28.04.2025 చనిపోయాడు. ఇతను తాంసి ఎస్‌బీఐ బ్యాంకులో ఎస్‌బీఐ జనరల్ ఇన్సురెన్స్ ప్రమాద బీమా పథకం ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. సంవత్సరానికి వెయ్యి రూపాయలు చెల్లించాడు. అనుకోని ప్రమాదంలో కరెంట్ పోల్ నుంచి కింద పడి మృతి చెందాడు. అతనికి భార్య నామిని అయిన గజకంటి కృష్ణవేణికి శుక్రవారం సాయంత్రం ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు రూ.20 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తాంసి మేనేజర్ శైలేష్, రీజినల్ మేనేజర్ జి.రామచంద్రరావు, చీఫ్ మేనేజర్ కె.సురేష్, ఎస్ఐ జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మిర్చి పంటతో లాభాలు



మిర్చి పంట

బోథ్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన ఆరేవిఠల్ అనే రైతు గత 36 సంవత్సరాల కాలంగా మిర్చిపంట సాగు చేస్తున్నాడు. తనకున్న అనుభవంతో ప్రతి సంవత్సరం మిర్చి పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

ఏటా ఎకరం చేస్తున్నరైతు : విఠల్

తనకు ఉన్న అనుభవంతో ప్రతి ఏడాది ఎకరం మిర్చి పంటను సాగు చేస్తున్నానని రైతు ఆరే.విఠల్ తెలిపారు. ఎకరానికి పంట పెట్టుబడి లక్ష రూపాయల అవుతుందని, ఆదాయం రెండు లక్షల వరకు వస్తుందన్నారు. ప్రతిపంట సాగు నిర్లక్ష్యం చేస్తే నష్టపోవాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సహకారంతో పంటలను సాగుచేసుకోవాలని సూచించారు.

పంట మార్పిడి అవసరం...

తనకున్న పొలంలో పంట మార్పిడి చేస్తూ పంటలను సాగు చేస్తున్నాని రైతు పేర్కొన్నారు. పంట మార్పిడి వల్ల దిగుబడి వస్తుందని అనేక రకాల వ్యాధులు దూరం అవుతాయన్నారు.

రుక్మాబాయి చూపిన మార్గంలో నడుచుకోవాలి

● సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి

తలమడుగు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విఠల రుక్మాబాయి చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆదిలాబాద్ జిల్లా సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి అన్నారు. శుక్రవారం తలమడుగు మండలంలోని కుచలాపూర్ గ్రామంలో నిర్వహించిన విఠల రుక్మాబాయి మూడవఆలయ వార్షికోత్స కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని కోరారు. ఆధ్యాత్మిక మార్గంలోని ఆనందమైన జీవితం సాగుతుందన్నారు. నిజంగా నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో మనిషికి మనశ్శాంతి లేకుండా ఉందన్నారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకుంటే ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గ్రామంలో విఠల రూప ఆలయం నిర్మించి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఎంతో అభినందనీయం అన్నారు. ఆలయ అభివృద్ధి కోసం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా గత మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో మాజీ సర్పంచ్ దేవరావు, మాజీ ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, రమాకాంత్, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కుచలాపూర్ విట్టల రుక్మాబాయి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి

పంట వ్యర్థాలను కాల్చొద్దు



సోనాల గ్రామ రైతు చేలలో పంట వ్యర్థాలపై అవగాహన కలిగిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



తేజాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో శ్యామ్

బోథ్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంటను తీసుకున్న తర్వాత రైతులు తమ పంట వ్యర్థాలను కాల్చివేయవద్దని అధికారులు తెలిపారు. వ్యర్థాలను కాల్చివేసినట్లయితే పరోక్షంగా పం టకు అవసరమైన సూక్ష్మజీవులను చంపుకున్నట్లేనని పేర్కొంటూ వ్యవసాయశాఖ అధికారులు రైతుల అవగాహన కలిగిస్తున్నారు.

● **పెద్ద మొత్తంలో వ్యర్థాల కాల్చివేత**

పంటలను తీసిన తర్వాత పెద్దమొత్తంలో పంట వ్యర్థాలను కాల్చివేయడం అనవాయితీగా వస్తున్నది. అయితే ఈ ప్రాంతంలో సోయాబీన్ మొక్కజొన్న పత్తి పంటలను సాగుచేస్తుంటారు. అయితే రైతులు పంట సమయం అయిన తర్వాత పత్తి పంట మొక్కలను కుప్పలుగా వేసి కాల్చివేస్తుంటారు. సోయాబీన్ పంట మొక్కలను సైతం ప్రతియేటా కాల్చివేయడం జరుగుతుంది. మొక్కజొన్న గడ్డిని రైతులు పశువులకు మేతగా వాడుకుంటారు. అయితే ఈ విషయమై రైతులకు అవగాహన లేకపోవడంతో ప్రతి ఏటా విలువైన పశుగ్రాసాన్ని కాల్చివేయడం జరుగుతుంది.

● **సూక్ష్మజీవులను కోల్పోతాం...**

పంట వ్యర్థాలను కాల్చివేయడం వల్ల రైతులకు పంట ఎదుగుదలలో ఉపయోగపడే సూక్ష్మజీవులు ఎన్నింటినో కోల్పోవడం జరుగుతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పంట వ్యర్థాలు భూమిలోనే కరిగిపోయే విధంగా చూడాలని పేర్కొంటున్నారు. కాల్చివేయడంవల్ల నష్టం జరుగుతుందే తప్ప ఎలాంటి లాభం లేదని అధికారులు రైతులకు వివరిస్తున్నారు. ఇకనైనా వాతావరణ కాలుష్యానికి కారణమైన పంట వ్యర్థాలను కాల్చకుండా ఉండాల్సిన అవసరం ఉంది.

కాల్చకూడదు...

నేరడిగొండ : పంట అవశేషాలను కాల్చకూడదని తేజాపూర్ వ్యవసాయ విస్తరణ అధికారి కె.శ్యామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రైతు సోదరులు పంట కాలం పూర్తికాగానే పంట యొక్క అవశేషాలు నేలలో కలియదున్నినట్లయితే నేలలో సేంద్రీయ కార్బనం అభివృద్ధి చెందుతుందన్నారు. పంట అవశేషాలు నెలలో కలియదున్ని తరువాత సింగిల్ సూపర్ పాస్పేట్‌ను చల్లినట్లైతే పంట అవశేషాలు నెలలో తొందరగా కుళ్ళిపోయి నేల గుల్లబారుతుందన్నారు. పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయని నెలలో నీటిని నిలుపుకునే సామర్థ్యం వృద్ధి చెందుతుందని నేలలో పోషకాల లభ్యత పెరుగుతుందన్నారు. పంట అవశేషాలను రైతు సోదరులు కాల్చకూడదని వ్యవసాయ విస్తరణ అధికారి కె.శ్యామ్ అన్నారు. పంట అవశేషాలను కాల్చడం వలన నేల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకొని పంట అవశేషాలను నేలలో కలియదున్ని దిగుబడులు సాధించాలని సూచించారు.

పంచాయతీ ట్రాక్టర్ బోల్తా



బోల్తాపడిన ట్రాక్టర్

కుభీర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కుభీర్ మేజర్ గ్రామపంచాయతీకి చెందిన చెత్త సేకరణ ట్రాక్టర్ శుక్రవారం ప్రమాదవశాత్తు మురికి కాలువలో బోల్తాపడింది. చెత్తసేకరణలో భాగంగా బజార్‌లైన్ మజిత్ దగ్గర నిలిపిన ట్రాక్టర్ డ్రైవర్‌కాకుండా పారిశుధ్య కార్మికుడు నడపడంతో ప్రమాదవశాత్తు మురికికాలువలో బోల్తాపడింది. కార్మికుడు మురికికాలువలో పడిపోయి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

ఆక్రమణలపై కఠిన చర్యలు

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ స్థలాలు, రోడ్డును అక్రమించి నిర్మాణాలు చేపటితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు హెచ్చరించారు. శుక్రవారం భుక్తాపూర్ కాలనీలో రోడ్డును అక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు తొలగించారు. రోడ్డుపై అక్రమ నిర్మాణాలు చేపట్టారంటూ గందేవార్ మోహన్ ఇంటి యజమని వీరేందర్‌పై హైకోర్టులో కేసువేశారు. హైకోర్టు నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ అధికారులు శుక్రవారం జేసీబీ సాయంతో దుకాణాలు కూల్చివేశారు. ముందుగానే అక్కడ ఉన్న దుకాణాల వారికి సామగ్రి తొలగించుకోవాలని సూచించారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓపెన్ స్థలంలో నిర్మాణాలు చేపట్టారని గందేమోహన్ హైకోర్టులో కేసు వేశారని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆక్రమణలపై సర్వే చేశామన్నారు. అది ఆక్రమణ అని తెలియడం, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో తొలగించామని పేర్కొన్నారు. ఇందులో టీపీవో సుమలత, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సద్దాం

నేరడిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు, గుండె ఆగిపోయిన అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేయడం ద్వారా విలువైన ప్రాణాలు కాపాడవచ్చని నేరడిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు, సిబ్బందికి సీపీఆర్‌పై ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సద్దాం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి కారణంగా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని, అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ జరిగి ప్రాణాపాయం తప్పుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో ప్రత్యక్షంగా చేసి చూపించి, శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ ఆఫీసర్ పవార్ రవీందర్, హెల్త్‌సూపర్‌వైజర్ సంతోష్, హెచ్ఏ సాయన్న, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. స్వామి, ఉపేందర్ రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. తొలిరోజు మందకొడిగా దాఖలైన నామినేషన్లు.. రెండో శుక్రవారం జోరందుకున్నాయి. ప్రతీ పల్లెలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. సర్పంచ్, వార్డుసభ్యుల పదవుల కోసం పోటీపడుతున్న అభ్యర్థులు ఓవైపు తమతో పోటీపడే ప్రత్యర్థులను బుజ్జగిస్తూనే మరోవైపు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో సైతం ఒక్కో పదవికి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జోరుగా నామినేషన్లు



- రెండోరోజు సర్పంచ్, వార్డుసభ్యుల పదవులకు హోరెత్తిన నామినేషన్లు
- ఆరు మండలాల్లో 277 సర్పంచ్, 302 వార్డుసభ్యుల నామినేషన్ల దాఖలు
- గ్రామాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యం ఇంకా కుదరని ఏకాభిప్రాయం
- కొనసాగుతున్న సమన్వయ కమిటీల బుజ్జగింపులు
- నేడు నామినేషన్ల దాఖలుకు ఆఖరు రోజు
- నామినేషన్లు ముగియకముందే రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్స్
- ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలపై ప్రధాన పార్టీలు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థుల నడుమ ఏకాభిప్రాయం కోసం వేసిన సమన్వయ కమిటీలు గ్రామాల్లో ముమ్మరంగా పర్యటిస్తూ ఆశావహులతో సమావేశాలు నిర్వహించాయి. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమై


వాహనాల తనిఖీ అధికారులు

రెండు రోజులు పూర్తయిన నేపథ్యంలో ఇంకా నామినేషన్లు వేసేందుకు కేవలం శనివారం ఒక్కరోజే మిగిలింది. ఈ నేపథ్యంలో శనివారం నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థుల సంఖ్య మరింత పెరగనుంది. ఏకాభిప్రాయం కుదిరిన చోట సైతం పార్టీలు బలపర్చిన అభ్యర్థులు కాకుండా పలువురు రెబల్స్‌గా బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు.

రంగంలోకి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు

గత రెండేళ్లుగా స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో క్షేత్రస్థాయిలో తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ఆశావహులంతా ఎలాగైనా పదవులు దక్కించుకోవాలనే కృతనిశ్చయంతో ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం, డబ్బుల పంపకం లాంటివి జోరందుకోనున్నట్లు ముమ్మరంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల పర్వం ముగియకముందే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న ఆరు మండలాలలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వచ్చిపోయే వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తనిఖీల బృందాలు రంగంలోకి దిగిన నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు, ఆశావహ అభ్యర్థులు సైతం వారికి చిక్కకుండా తమ పని గుట్టుగా కానిచేస్తూ ఎత్తుగడలు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నామినేషన్ల దశలోనే పంచాయతీ ఎన్నికలు రోజురోజుకు వేడెక్కిస్తున్న నేపథ్యంలో ప్రచార పర్వం ప్రారంభమైతే పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.


ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ వద్ద వాహనాల తనిఖీ

277 సర్పంచ్, 302 వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు..

జిల్లాలో మొదటి విడతలో ఎన్నికలు జరుగుతున్న దస్తురాబాద్, కడెం, ఖానాపూర్, పెంబి, మామడ, లక్ష్మణచాంద ఆరు మండలాల్లో రెండోరోజు 188 సర్పంచ్ నామినేషన్లు, 276 వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలయ్యాయి. గత రెండు రోజులుగా ఇప్పటివరకు దస్తురాబాద్ మండలంలో 30 సర్పంచ్, 28 వార్డుసభ్యుల నామినేషన్లు, కడెం మండలంలో 74 సర్పంచ్, 91 వార్డు సభ్యుల నామినేషన్లు, ఖానాపూర్‌లో 30 సర్పంచ్ నామినేషన్లు, 33 వార్డు సభ్యుల నామినేషన్లు, పెంబి మండలంలో 34 సర్పంచ్, 30 వార్డు సభ్యుల నామినేషన్లు, మామడ మండలంలో 57 సర్పంచ్ నామినేషన్లు, 68 వార్డు సభ్యుల నామినేషన్లు, లక్ష్మణచాంద మండలంలో 52 సర్పంచ్, 52 వార్డుసభ్యుల నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఆరు మండలాలలో మొత్తం 136 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ పదవి కోసం ఇప్పటివరకు 277 నామినేషన్లు రాగా, 1072 వార్డులకు గాను 302 నామినేషన్లు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.




అవార్డు అందుకుంటున్న యూనివర్సిటీ అధికారులు

ఆర్జీయూకేటీకి గ్లోబల్ గుర్తింపు

- స్కిల్ డెవలప్‌మెంట్ లీడర్‌షిప్ అవార్డు - 2025 సొంతం

బాసర, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నాలెడ్జ్ ఆఫ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) ప్రతిష్టాత్మకమైన స్కిల్‌డెవలప్‌మెంట్ లీడర్‌షిప్‌అవార్డు - 2025ను దక్కించుకుంది. వరల్డ్ ఎడ్యుకేషన్ కాంగ్రెస్ అందించే ఈ అవార్డును ఆర్జీయూకేటీ కైవసం చేసుకోవడం విద్యారంగంలో విశేషంగా భావించవచ్చు. ఈ అవార్డు ప్రధానోత్సవం ఈనెల 27న హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీయూకేటీ వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ 2008లో స్థాపించబడిన విశ్వవిద్యాలయం అంచలంచెలుగా ఎదిగిందని పేర్కొన్నారు. ఈ మైలురాయిని చేరుకోవడంలో అధ్యాపకులు, ప్రొఫెషనల్ సిబ్బంది, పూర్వవిద్యార్థులు, ప్రస్తుతం విద్యార్థుల సహకారం ప్రశంసనీయమని కొనియాడారు. ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీ బాసర విద్యార్థుల సంక్షేమ వికాసాలకు ఎంతో కృషి చేస్తోందని వివరించారు. ఉద్యోగ నియామకాలు, అంతర్జాతీయ వ్యాప్తి, ప్రభుత్వ ఉద్యోగాలలో విద్యార్థుల భాగస్వామ్యం, వ్యవస్థాపకత, సాంస్కృతిక సామాజిక సమ్మేళనాలు, ఎన్ఎస్ఎస్, స్నాతకోత్సవం, వంటి వాటి అములో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డు రావడం పట్ల ఆర్జీయూకేటీ ఉద్యోగులు విద్యార్థులు తమ హర్షం వ్యక్తం చేశారు. విద్యాప్రమాణాలను, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచడంలో విశ్వవిద్యాలయం చేస్తున్న కృషికి ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తోందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.


హరిహరక్షేత్ర ఆలయ గురుస్వామికి సన్మానం

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మల్లన్నగుట్ట హరిహర క్షేత్ర ఆలయ గురుస్వామి నవయుగ మూర్తి గురుస్వామిని శుక్రవారం పాకాల ఫౌండేషన్ చైర్మన్ పాకాల రామచందర్ శాలువాతో సత్కరించారు. గత కొన్నేళ్లగా అయ్యప్ప మాల ధరిస్తూ, భక్తులకు మాల వేస్తూ, ఆధ్యాత్మిక చింతనతో అయ్యప్ప స్వామికి సేవ చేసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంతోష్ శుక్ల స్వామి, హరీష్ స్వామి, గంగన్న స్వామి, విశాల్ స్వామి, మహేష్ స్వామి, తదితర స్వాములు ఉన్నారు.


రవీందర్‌ను పరామర్శిస్తున్న జర్నలిస్టులు

రవీందర్‌కు జర్నలిస్టుల పరామర్శ

నర్సాపూర్ (జి), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌ను జిల్లాలోని పలువురు జర్నలిస్టులు శుక్రవారం ఆయనను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన కలిసిన వారిలో లక్ష్మణచాంద ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గోలి గంగాధర్, మామడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నిర్మల్‌టౌన్ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి భానుచందర్, సారంగాపూర్ పాత్రికేయులు కొండ రమేష్, నర్సాపూర్(జి) ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సంతోష్ రామ్ గౌడ్ తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సారంగాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని ప్రధానోపాధ్యాయులు మునిందర్ రాజు అన్నారు. శుక్రవారం మండలంలో గల చించోలి (బీ) జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు యువత మత్తుకు బానిసలైతే కుటుంబాలు, సమాజం ఎలా దెబ్బతింటుందో వివరించారు. అనంతరం విద్యార్థుల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు తమ ఏకాగ్రతను చదువుపై, పెట్టి తమ లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, అన్నపూర్ణ, మహేశ్వర్, రవిరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాగ్రత్త చర్యలతో అగ్ని ప్రమాదాలు దూరం

- భైంసా ఫైర్ ఆఫీసర్ రవి


ప్రమాద నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భైంసా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్త చర్యలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని, కొద్దిపాటి జాగ్రత్త చర్యలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు జరగవని భైంసా ఫైర్‌ఆఫీసర్ రవి అన్నారు. శుక్రవారం భైంసాలోని వినాయక్‌నగర్ కాలనీ పరిధిలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు జరగడానికి గల కారణాలను వివరించారు. గ్యాస్ సిలెండర్, విద్యుత్‌తో ఏర్పడే ప్రమాదాలను తెలిపారు. ప్రమాదం జరిగినపుడు అవలంబించాల్సిన పద్ధతులను వివరించారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వివరించారు. గుడిసెలు, పెంకుటిల్లు ప్రమాదాల బారిన పడ్డప్పుడు పాటించాల్సిన రక్షణ చర్యలు తెలిపారు. వంటగ్యాస్ వినియోగించినపుడు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. భూకంపలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సి పల్ వినాయక్‌రావ్, కరస్పాండెంట్ రేగుంట రవీందర్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులున్నారు.

నామినేషన్ కేంద్రం పరిశీలన



కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

మామడ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు పొన్కల్ గ్రామంలోని నామినేషన్ కేంద్రాలను శుక్రవారం ట్రెయినీ అదనపు కలెక్టర్ రాకేష్ పరిశీలించారు. నామినేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొన్కల్ ఉన్నత పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయ తీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి


ఏవో, ఏఈవోలతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్‌రాజ్

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ముథోల్‌లోని వ్యవసాయ ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం ఏడీఏ శ్రీనివాస్‌రాజ్ ముథోల్, తానూర్, లోకేశ్వరం, బాసర ఏఈవోలు, ఏవోలతో ప్రత్యేక రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది కలుగకుండా సీడ్స్, ఫర్టిలైజర్ తదితర వాటి గురించి చర్చించారు. అందుబాటులో ఉన్నవెన్ని.. లోటుపాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఈవోలు రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సాగుపై సలహా, సూచనలు ఇవ్వాలని సూచించారు. అలాగే పీఎం కిసాన్ గురించి ఇబ్బందులు కలుగకుండా రైతులకు తగు వివరాలు తెలియజేయాలని తెలిపారు. అలాగే మండలాల వారిగా మండల సాగు పరిస్థితి, విత్తనాలు, ఎరువుల గురించి క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సలహా, సూచనలను ఇచ్చారు. కార్యక్రమంలో ఏవోలు రచన, మనీషా, శ్రీనివాసరావు, గిరిరాజు, ఏఈవోలున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కుంటాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కుంటాలలోని ఆదర్శ మోడల్ పాఠశాలలో శుక్రవారం త్వరలో జరగనున్న జిల్లాస్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేసేందుకు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్ అథ్లెటిక్ పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి పోటీలు జరగనున్నాయని, ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు తమ ఆటలో నైపుణ్యం కోసం సాధన చేస్తూ ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డా. ఉప్పు కృష్ణంరాజు

నిర్మల్‌చైన్‌గేట్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డా. ఉప్పు కృష్ణంరాజు కొనియాడారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సంఘం సభ్యులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగం ద్వారా బీసీ ప్రజలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడే జ్యోతిబాపూలేకి నిజమైన నివాళులు అర్పించినట్లు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాకోకన్వీనర్లు కే.అశోక్‌చారి, సిరికొండ రమేష్, జింక లక్ష్మీ నారాయణ, పండరినాథ్, కే.కిషన్, అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


బహుమతులు పొందిన విద్యార్థులు

భైంసా, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఎంసీటీ చైర్మెన్ డా.నగేష్, శిశుమందిర్ విద్యాసంస్థల ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ సీహెచ్ కృష్ణమాచార్యులు, విభాగ్ శైక్షనిక్ ప్రముఖ్ కె.వేణుమాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పులేనగర్ శిశుమందిర్ పాఠశాలలో వివిధ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దివంగత డీసీసీ మాజీ అధ్యక్షుడు దిగంబర్ మాహశెట్టివార్ జ్ఞాపకార్థం వారి కుమారుడు రమేష్ మహశెట్టివార్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందచేసిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతీ విద్యార్థి గుర్తుపెట్టుకోవాలని సూచించారు. నేటి పోటీతత్వ యుగంలో ధీటుగా రాణించేందుకు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందెల దేవేందర్, శిశు మందిర్ విద్యాసంస్థల ప్రాంత సంగీత ప్రముఖ్ ఎం.సాయినాథ్, ఇటాలిక్ హ్యాండ్ రైటింగ్ ట్రైనర్ భగవాన్‌దాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.